క్లుప్తంగా

వైభవంగా కార్తీక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

నగరి: మండలంలోని తడుకుపేట శ్రీసత్య సాయి ఆలయంలో ఆదివారం కార్తీక మాస పూజలను వైభవంగా నిర్వహించారు. తడుకు పేట శ్రీసత్య సాయి భజన మండలి ప్రాంగణం లోని బిల్వ చెట్టు, వేప, జమ్మి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. భజన కీర్తనలు ఆలపించారు. మహా మంగళ హారతి నిర్వహించి, మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న ప్రసాదాలను వితరణగా అందించారు. వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలి కన్వీనర్ వెంకటరమణ, సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు జీడీ నెల్లూరులో భూ పంపిణీ

గంగాధర నెల్లూరు: నియోజకవర్గంలోని పేదలకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మధ్యాహ్నం డిప్యూటీ సీఎం నారాయణ స్వామి చేతులమీదుగా పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఇన్బనాథన్ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



నగరిలో కాంగ్రెస్ నాయకుల విజయోత్సవం

నగరి: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణంలో ఆ పార్టీ నాయకులు బాణసంచా పేల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటు వేసిన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పీసీసీ సభ్యుడు నటరాజ్ మొదలియార్, డీసీసీ కార్యదర్శులు ఢిల్లీ, దేశయ్య, నాయకులు చిరంజీవి రెడ్డి, రజనీ దేశప్ప, సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

చౌడేపల్లె: శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమం నిర్వహణకు బెంగళూరు ఎమ్మెల్సీ రామోజీ గౌడ రూ.25వేల విరాళాన్ని ఈఓ చంద్రమౌళికి అందజేశారు. తమ కోర్కెలు ఫలించడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించినట్టు చెప్పారు. తమవంతు విరాళమిచ్చినట్టు తెలిపారు. దాత కుటుంబ సభ్యులను ఈఓ సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

శాస్త్రోక్తంగా శ్రీకపిలేశ్వర స్వామి రుద్రయాగం



యాగశాలలో కొలువైన శ్రీకామాక్షి దేవి సమేత శ్రీకపిలేశ్వర స్వామివారు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో మూడో రోజైన ఆదివారం రుద్ర యా గం శాస్త్రోక్తంగా చేపట్టారు. హోమంలో పాల్గొ న్న భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో కార్తీక మాస ధాత్రి హోమాలు

పుంగనూరు: పట్టణంలోని శ్రీహరిహర బ్రాహ్మణ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాస ధాత్రి హోమాలు చేశారు. శంకరాచార్యులు పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రాజశేఖర్ దీక్షితులు, రాజేష్, రామమూర్తి, మధు, రామచంద్రరావు, ఉదయ్‌కుమార్, సుబ్రమణ్యం, బ్రాహ్మణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

9న ప్రతిభకు సన్మానం

చిత్తూరు రూరల్: వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి ప్రజాహిత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు రాజరత్నంరెడ్డి తెలిపారు. నగరంలోని రెవెన్యూ భవనంలో ఉదయం ప్రారంభమయ్యే కార్యక్రమానికి సాహితీ వేత్తలు, కవులు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

క్రీడల్లో యువతను ప్రోత్సహించాలి

తవణంపల్లె: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఆడుదాం..ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో మండలంలోని పైమాఘం గ్రామానికి చెందిన క్రీడాకారులకు (యువకులకు) క్రికెట్ కిట్ అందజేసినట్లు దాత, అర్ధగిరి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్, పారిశ్రామికవేత్త పైమాఘం సుగుణాకర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

పుత్తూరు: ఎస్వీఆర్‌పురంలో నీటి మళ్లింపు



పెనుమూరు మండలంలో పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



రోజంతా ఎడతెరపి లేని వర్షం



ఎన్టీఆర్ జలాశయాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అనిల్‌కుమార్

నగరి: నియోజకవర్గంలో శనివారం మధ్యాహ్నం నుంచి ప్రాంభమైన వర్షం ఎడతెరపి లేకుండా ఆదివారమంతా కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై అక్కడక్కడా నీరు పారుతోంది. వాతావరణం చల్లబడి చలి ఎక్కువైంది. ప్రధాన రహదారుల్లో జనసంచారం కనిపించ లేదు. వర్షం కారణంగా మండలంలోని తడుకుపేట వద్ద చెన్నై నుంచి పెద్ద యంత్రాన్ని తరలిస్తున్న లారీ నుంచి ట్రైలర్ పక్కకు వాలి బోల్తాపడింది.

చెరువులకు జలకళ

నీటి పారుదల కాలువల్లో ప్రవహించే నీరు చెరువులకు చేరుకుంటోంది. నగరి మండలంలో 34 చెరువుల్లో 10 పెద్ద చెరువులు ఉండగా, అందులో 8 చెరువులు దాదాపు నిండాయి. ముడిపల్లి చెరువు కలుజు పారుతోంది. మిగిలిన చెరువులు 50 శాతం నిండి ఉన్నాయి. విజయపురం మండలంలో 38 చెరువులు ఉండగా 4 కలుజు పారుతున్నాయి. మిగిలినవి 60 శాతానికి పైగా నిండాయి. నింద్ర మండలంలో 42 చెరువులు ఉండగా, అత్తూరు, శ్రీరామాపురం చెరువుల్లో 50 శాతం నీరు చేరింది. మిగిలిన చెరువులు కూడా జలకలను సంతరించుకుంటున్నాయి. పుత్తూరు మండలంలో 43 చెరువులు ఉండగా, అన్నీ దాదాపుగా నిండేస్థాయిలో ఉన్నాయి. వడమాలపేట మండలం 21 చెరువులు ఉండగా, 50 శాతం మేర నిండాయి.

స్తంభించిన జన జీవనం

పుత్తూరు: అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా వర్షాలు పడుతుండడంతో జనజీవనం స్తంభించింది. పుత్తూరు పరిసరాల్లో శనివారం వర్షం మోస్తారుగా పడగా, ఆదివారం తెల్లవారు జామున భారీగా కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరాయి. చెరువుల్లోకి పుష్కలంగా నీరు చేరుతోంది. శనివారం ఉదయం 8-30 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు 62 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. వాగులు వంకలల్లో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మరో రెండు రోజుల పాటు తుపాను ప్రభావం ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం విద్యాలయాలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అధికారులు మండలంలోని పరిస్థితులను ఎప్పటి కప్పుడు సమీక్షిస్తున్నారు. మంచు కాలానికి తోడు వర్షాలు తోడవడంతో వాతవరణ మార్పుతో పిల్లలు, పెద్దలు జ్వరాల బారిన పడే అవకాశం ఉందని, తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వడమాలపేట మండల పరిధిలోని ఎస్వీఅర్పురం పంచాయతీ ఆదిఆంధ్రవాడలోని రోడ్డుపైకి వర్షపు నీరు చేరడంతో సర్పంచ్ మణిరాజు జేసీబీతో నీటిని బయటకు మళ్లించారు.

94.2 మిల్లీ మీటర్ల వర్షపాతం

నగరిలో శని, ఆదివారాలు 94.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరపి లేని వర్షంతో పలు ప్రాంతాల్లో పంట పొలాలపై నీరు నిలిచింది. వర్షాల నేపథ్యం మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి తెలిపారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే 9949563111, 9010417417, 9704603820, 9884288313 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. సహాయక చర్యల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

కార్వేటినగరంలో 95 మి.మీ. వర్షపాతం

కార్వేటినగరం: తుపాను ప్రభావంతో మండలంలో 95 మి.మీ.వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ అధికారిణి హేమలత తెలిపారు. ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో అత్యధిక వర్షపాతం నమోదైందని, పాలసముద్రంలో 55.4 మి.మీ. శ్రీరంగరాజపురంలో 80.6 మి.మీ., వెదురుకుప్పంలో 46.4 మి.మీ., అత్యల్పంగా 37.2 మి.మీ., గంగాధరనెల్లూరు మండలంలో వర్షం పడినట్లు పేర్కొన్నారు. దీంతో నియోజకవర్గంలో పలు చోట్ల చెట్లు విరిగి రోడ్లపై, విద్యుత్ తీగలపై పడటంతో వాహన రాకపోకలకు, విద్యుత్ అంతరాయం కలిగింది. కార్వేటినగరంలోని కృష్ణాపురం జలాశయానికి వంద క్యూసెక్కుల నీరు చేరుతోందని, వర్షాలు ఇలాగే కొనసాగితే ఎగువ నుంచి వచ్చే నీటి మట్టాన్ని బట్టి జలాశయం గేట్లను ఎత్తే అవకాశం ఉంటుందని ఇరిగేషన్ ఏఈ రవీంద్రనాయక్ తెలిపారు. పెనుమూరు మండలం కలవకుంట వద్ద ఉన్న ఎన్టీఆర్ జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 200 క్యూసెక్కులు నీళ్లు వస్తుండడంతో, 200 క్యూసెక్కుల నీటిని ఒక్క గేటు ద్వారా బయటకు విడుదల చేస్తున్నట్లు ఎన్టీఆర్ జలాశయం ఏఈ తెలిపారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండండి

పెనుమూరు (కార్వేటినగరం): బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కలవకుంట (ఎన్టీఆర్) జలాశయాన్ని ఆదివారం సందర్శించారు. ఎస్.ఐ మాట్లాడుతూ నదీ పరీవాహ ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులు వాగులు, వంకలు దాటే సాహసాలు చేయకూడదన్నారు. జలాశయం నుంచి నీటిని విడుదల చేసేందుకు గంట ముందే సైరన్ మోగించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రాత్రి 12 గంటల అనంతరం జన సంచారం తగ్గుముఖం పట్టాక గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయాలని చెప్పారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

వెదురుకుప్పం: మండలంలోని రైతులు, విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ రామాంజనేయులు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో తడిచేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదన్నారు. రైతులు సైతం పొలాల వద్ద మోటార్లు, స్టార్టర్లు, వైర్లను తాకి ఇబ్బందులు పడవద్దని సూచించారు. విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

వణికిస్తున్న తుపాను

వెదురుకుప్పం: మండలంలో తుపాను ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చలిగాలులతోపాటు వర్షం పడుతుండడంతో ప్రజలు చలితో వణికిపోతున్నారు. తుపాను కారణంగా పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. రోడ్లు జలమయమయ్యాయి. ముసురుతో ప్రజల జనజీవనం స్తంభించింది. వాగులు వంకల్లోకి మోస్తరు వర్షపు నీరు చేరింది.



పూర్తిగా నిండిన దామరపాకం చెరువు



నగరి: బోల్తా పడిన లారీ ట్రైలర్



ఎం.కొత్తూరులో వేరుశెనగ పంటపై నిలిచిన నీరు

నీట మునిగిన పంటలు



గోవర్ధనపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు





కడూరు వద్ద నీట మునిగిన వరి పంట, పెద్ద పాండూరు మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్లవాగు

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం ప్రాంతంలో ఆదివారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. శనివారం సాయంత్రం 6 నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు 102.6 మిమీల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ గౌరిశంకరరావు తెలిపారు. కడూరు, చిలమత్తూరు, గూడలవారిపాళెం, తాగేలి, సీఎల్ఎన్‌పల్లి ప్రాంతాల్లో పంట నీట మునిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే పంట దెబ్బ తినడమే కాకుండా చెరువులు కూడా ప్రమాదస్థాయికి చేరుకునే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. గ్రామాల్లో వీధులు జలమయం కావడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. రోజువారీ కూలీలు, మరమగ్గాల నేతన్నలు, చేతివృత్తుల వారు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారు.

పలు ప్రాంతాల్లో స్తంభించిన రాకపోకలు

మండలంలోని పెద్ద పాండూరు నుంచి తొండంబట్టుకు వెళ్లే రాళ్లవాగు లోలెవల్ కాజ్‌వేపై వరదనీరు ఉధృతి పెరగడంతో ఆదివారం తెల్లవారుజాము నుంచే రాకపోకలు స్తంభించాయి. సిద్దేశ్వరపురం, వెంకటేశ్వర గిరిజనకాలనీ, కుప్పటతాగేలి, తొండంబట్టు, నాగనందాపురం, అంబికాపురం, ఎంజీనగర్, సిద్ధాపురం గ్రామాల వారికి రాకపోకలు స్తంభించాయి. వరదయ్యపాళెం-సంతవేలూరు మార్గంలోని పులిబొంద, మార్లమడుగు కాలువల్లో నీటి ఉధృతి పెరగడంతో ఆ మార్గంలో కూడా రాకపోకలు స్తంభించాయి. వరదయ్యపాళెం పంచాయతీలోని బీజీఆర్ గిరిజనకాలనీ, అనిల్ గిరిజనకాలనీల్లోకి పెద్దఎత్తున వర్షపునీరు చేరుకుంది. కాలనీవాసులను సమీపంలోని గోవర్ధనపురం ప్రాథమిక పాఠశాలకు తరలించారు.



కడూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కరుణానది



మార్లమడుగు వద్ద పోలీసుల భద్రతా ఏర్పాట్లు

వంతెనల వద్ద సహాయక చర్యలు

ఉధృతంగా ప్రవహిస్తున్న వంతెనల వద్ద ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ఎస్ఐ నాగార్జున రెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు గట్టి చర్యలు తీసుకున్నారు. పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. వరదయ్యపాళెంలోని గోవర్ధనపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పాముల కాలువ వద్ద ఎస్ఐ, సిబ్బందితో స్వయంగా వాహనాలను దాటిస్తున్నారు.



నారాయణవనం: ఆకర్షిస్తున్న తుంబురతీర్థం



నారాయణవనం: కైలాసకోనలో జలపాతం హోరు

గోశాల ఆకస్మిక తనిఖీ



సూచనలిస్తున్న చైర్మన్ తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం గోశాలను ఆదివారం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాల సిబ్బంది వర్షం కారణంగా రాకపోవడంతో ఉదయం 11.30 గంటలు దాటినా గోవులకు ఆహారం అందించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసి ఆహారం అందించాలన్నారు. వర్షం కురుస్తున్న నేపథ్యంలో గోవులకు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గోశాల సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మనువాదంతో పోరాటమే పంచుకుందాం..రా

గంగవరం: పలమనేరు మండలంలోని కళామందిరంలో పానుగోటి కృపాకర్ కవితా సంపుటి పంచుకుందాం రా.. పరిచయ వేదిక ఆదివారం కార్యక్రమానికి ప్రసిద్ధ సాహితీవేత్తలు జూపాక సుభద్ర, కవితశ్రీ, కుమారస్వామిరెడ్డి, సిద్దార్థ, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, బాబ్జి, గంటామోహన్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు, యుగంధర్, గిరిధరమూర్తి, శ్రీనివాస తదితరులు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రసంగించారు. మనువాదంతో పోరాటమే 'పంచుకుందాం రా' అని పేర్కొన్నారు. వర్తమాన తెలుగు కవిత్వంలో కొత్త ఒరవడి కృపాకర్ కవితా సంపుటి అని, బహుజన సాహిత్యానికి ఒక మేలిమ కూర్పు అని వ్యాఖ్యానించారు. అద్భుతమైన కవిత్వాన్ని కృపాకర్ అందించారని అభినందించారు. అనంతరం కవి పానుగోటి కృపాకర్ దంపతుల్ని ఘనంగా సత్కరించారు. పలమనేరు రచయితల సంఘం అధ్యక్షుడు పలమనేరు బాలాజి, తెలుగు సాహిత్య సమితి అధ్యక్షుడు తులసినాధంనాయుడు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా పరిశీలన పక్కాగా చేపటినట్లు మండల ఎన్నికల అధికారి, తహసీల్దార్ భార్గవి తెలిపారు. ఆదివారం మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించి, జాబితాను పక్కాగా పరిశీలించినట్లు తెలిపారు. చేపట్టామన్నారు. మృతి చెందిన వారి పేర్లు, డబుల్ ఎంట్రీలు, వివాహమైన వారి ఓట్లను తొలగింపును క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఫారమ్-6 కింద 69 మంది, ఫారమ్-7 కింద 21 మంది, ఫారమ్-8 కింద 17 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

మామిడిలో సస్యరక్షణకు ఇదే సమయం



చెర్లోపల్లెలో సూచనలిస్తున్న ఉద్యానవన అధికారి వెంకటసౌజన్య

పుత్తూరు: ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో పూత దశకు ముందే మామిడి తోటల్లో తగిన సస్య రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా నాణ్యమైన దిగుబడికి అవకాశాలు ఉంటాయని ఉద్యానవన అధికారి జి.వెంకటసౌజన్య తెలిపారు. సస్యరక్షణకు ఇదే మంచి సమయమని పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరు మండలం చెర్లోపల్లె, చినరాజుకుప్పం గ్రామాల్లో ఆమె పర్యటించారు. మామిడి తోటల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలను రైతులకు ఇలా తెలియ జేశారు.

- మొక్క చుట్టూ డబుల్ రింగ్ పద్ధతి ద్వారా పాదులను ఏర్పాటు చేస్తే నీటి నిలువ మొదలు వద్ద ఆగకుండా నివారించ వచ్చును.
- వర్ష సూచన ఉన్న ప్రాంతాల్లో పైపాటి నీరు అందించడం ఆపివేయాలి
- వర్షాల కారణంగా పక్షికన్ను తెగులు వచ్చే అవకాశం ఉంది. దీని నివారణకు ప్రాపిహెచ్ గ్రాము లేదా కార్బండిజం గ్రాము లేదా ఆమిస్టార్ గ్రాము మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి
- బాక్టీరియా ఆకుమచ్చ ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 10 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ లేదా ఆగ్రోమైసిన్ 6 గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి
- కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటితో కలిపి ప్రతి 15 రోజులకు ఒకసారి పిచికారీ చేయడం ద్వారా తెగుళ్ల నుంచి మామిడి పంటను కాపాడుకోవచ్చు.

సంపూర్ణ రీతూ కవచ్ భీమా చేసుకోండి

వాతావరణ మార్పుల కారణంగా మామిడి పంట నష్టాన్ని నివారించేందుకు అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (ఏఐసీ) సంస్థ వారు సంపూర్ణ రీతూ కవచ్ (ఎస్ఆర్‌కె) అనే బీమా పథకంతో ముందుకు వచ్చినట్లు వెంకటసౌజన్య తెలిపారు. 2023 డిసెంబర్ 15 నుంచి 2024 మే 31 వరకు అధిక వర్షపాతం, అధిక ఉష్ణోగ్రత, గాలిలో తేమ వంటి అంశాల ఆధారంగా బీమా చేసుకొనే అవకాశం కల్పించారన్నారు. ఎకరాకు రూ.1,416 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పై తెలిపిన కారణాలతో పంట నష్టం వాటిల్లితే ఎకరాకు రూ.24 వేలు ఏఐసీ ద్వారా చెల్లిస్తారని వెల్లడించారు. ఆసక్తి గల మామిడి రైతులు ఈనెల 14వ తేదీ లోపు ప్రీమియంతో పాటు రైతు ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, పట్టాదార్ పాస్‌బుక్, కౌలు రైతు అయితే కౌలుదారు ధృవపత్రం తీసుకొని రైతు భరోసా కేంద్రాలల్లో సంప్రదించాలని తెలిపారు.

కార్మిక సంక్షేమ చట్ట సాధనకు పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

తిరుపతి కల్చరల్: హమాలీ కార్మికుల సంక్షేమ చట్టం సాధన కోసం సమర శంఖం పూరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఆదివారం శ్రీబాలాజీ లారీ అండ్ అన్‌లోడింగ్ వర్కర్స్ యూనియన్ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా నేత చంద్రశేఖర్‌రెడ్డి, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ నేతలు ఉదయ్‌కుమార్, రాధాక్రిష్ణ, ఎన్‌డీ.రవి, హమాలీ యూనియన్ నేతలు బాబు, నాగరాజు, టి.సుబ్రమణ్యం, మునికృష్ణ, సుదర్శన్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపుదాం



దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: దివ్యాంగుల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక బైపాస్‌లోని వైఎస్సార్ సీపీ కంట్రోల్ రూమ్ వద్ద దివ్యాంగులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు జగనన్న ప్రభుత్వం రూ.5 వేలు పింఛన్ వంటి పథకాలతో అన్ని విధాలుగా ఆదుకుంటోందని తెలిపారు. అంతకుముందు ఉదయం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తన సొంత ఖర్చులతో చెంచురాజుకండ్రిగ, సిద్దిరాజు కండ్రిగ గ్రామాల్లోని దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, నాగలాపురం మండల అధ్యక్షుడు అపరంజిరాజు, పల్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, పార్టీ మండల ఉపాధ్యక్షుడు నాయకులు పాల్గొన్నారు.